ఎన్ఇపితో పేదలు విద్యకు దూరం

- విద్యా కేంద్రీకరణ, ప్రయివేటీకరణ, కాషాయీకరణ దేశానికి ప్రమాదం
- నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాల్సిందే
- సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి
- బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కెసిఆర్ దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలి
- టిఎస్‌యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం (ఎన్ఇపి)-2020 అమల్లోకి వస్తే పేద విద్యార్థులు విద్యకు దూరమవుతారని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి చెప్పారు. విద్యా కేంద్రీకరణ, ప్రయివేటీకరణ, కాషాయీకరణ, కార్పొరేటీకరణ కోసమే ఎన్ఇపిని కేంద్రం తెచ్చిందని విమర్శించారు. నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాల్సిందేనని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో ఉన్న సార్థ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ప్రారంభమైన టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ఐదో మహాసభ శనివారం రెండోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జంగయ్య, చావ రవి మాట్లాడుతూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న విధానాలపై చర్చించామని వివరించారు. ఎన్ఇపిని తెచ్చి దేశంలో బిజెపి ప్రభుత్వం అలజడిని సృష్టించిందని విమర్శించారు. ప్రజల ఐక్యత మధ్య చిచ్చుపెట్టేలా, మెజార్టీ మత భావజాల ఉన్మాదాన్ని రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నదని చెప్పారు. పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యేలా ఎన్ఇపి ఉందన్నారు. డ్రాపౌట్స్ పెరుగుతారని తెలిపారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఎస్‌టిఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపట్టాలని అన్నారు. కేరళ, తమిళనాడు, ఢిల్లీ ప్రభుత్వాలు అమలు జరిపేది లేదంటూ నిర్ణయించాయని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం నిర్ద్వందంగా ఎన్ఇపిని తిరస్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌తో ఉద్యోగులకు సామాజిక భద్రత లేదన్నారు. ఉద్యోగి మరణిస్తే రూ.వెయ్యి, రూ.రెండు వేలు మాత్రమే పెన్షన్ వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, పంజాబ్ ప్రభుత్వాలు సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాయని వివరించారు. ఇప్పుడు హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం కూడా ఓపిఎస్‌ను అమలు చేయాలని క్యాబినెట్‌లో నిర్ణయించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలోనూ సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. దేశవ్యాప్తంగా బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో సిపిఎస్ రద్దు కోసం ఉద్యమానికి నాయకత్వం వహించాలని సూచించారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

రాష్ట్రంలో 17 ఏండ్లుగా పర్యవేక్షణ అధికారులు, ఏడేండ్లుగా పదోన్నతులు, ఐదేండ్లుగా బదిలీల్లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని జంగయ్య, చావ రవి చెప్పారు. ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలనీ, బదిలీలు, పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించాలి

హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. మాణిక్‌రెడ్డిని గెలిపించుకునేందుకు అందరం కృతనిశ్చయంతో పని చేయాలన్నారు.

మన ఊరు-మనబడికి నిధుల కొరత

మన ఊరు-మనబడి కార్యక్రమానికి సంబంధించి మూడేండ్లలో రూ.7,289 కోట్లతో 26,067 పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని జంగయ్య, చావ రవి చెప్పారు. మొదటి విడతలో 9,123 స్కూళ్లలో రూ.3,497.62 కోట్లతో మౌలిక వసతులు కల్పించాలని ప్రకటించిందన్నారు. ఇప్పటి వరకు నిధుల కొరత వల్ల పది శాతం బడుల్లోనే పనులు పూర్తయ్యాయని వివరించారు. మన ఊరు-మనబడి కార్యక్రమానికి నిధుల కొరత లేకుండా బడ్జెట్‌ను విడుదల చేసి పనులను ఈ విద్యాసంవత్సరంలోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులపై మతోన్మాదుల మూకదాడులను అరికట్టాలి

నిజామాబాద్ జిల్లా కోటగిరిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లిఖార్జున్‌పై దాడిని ఖండిస్తున్నామని జంగయ్య, చావ రవి చెప్పారు. ఉపాధ్యాయులపై మతోన్మాదుల మూకదాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 51(హెచ్) ప్రకారం తరగతి గదిలో శాస్త్రీయ దృక్పథాన్ని ఉపాధ్యాయులు పెంపొందించాలని సూచించారు. హేతువాద భావాలను చెప్తే దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కెజిబివిల్లో 12 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం బేసిక్ పే ఇవ్వాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలనీ, ఆరోగ్యకార్డులు కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర మహాసభల కార్యనిర్వాహక అధ్యక్షులు ఇ గాలయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్‌నాయక్, వెంకటప్ప, కోశాధికారి జగన్నాథశర్మ, కార్యదర్శులు కిషన్‌చౌహాన్, గణేష్, రఘుపాల్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం పండుగైనప్పుడే దేశానికి సంపూర్ణ క్రాంతి

- ప్రజలకు సిఎం కెసిఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతాంగానికి వ్యవసాయం పండుగైన నాడే.. భారత దేశానికి సంపూర్ణ క్రాంతి చేకూరుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అభిప్రాయపడ్డారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని సిఎం కెసిఆర్ దేశ, రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పంట పొలాల నుంచి ధాన్యపు రాశులు ఇండ్లకు చేరుకున్న శుభ సందర్భంలో రైతన్న జరుపుకునే సంబురమే సంక్రాంతి పండుగనీ, నమ్ముకున్న భూతల్లికి రైతు కృతజ్ఞతలు తెలుపుకునే రోజే సంక్రాంతి పండుగ అని సిఎం అభివర్ణించారు.రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని పునర్జీవింప చేసేందుకు చేపట్టిన కార్యాచరణతో తెలంగాణ పల్లెలు పచ్చని పంట పొలాలు, ధాన్యరాశులు, పాడి పశువులు, కమ్మని మట్టివాసనలతో సంక్రాంతి శోభను సంతరించుకుని వైభవోపేతంగా వెలుగొందుతున్నాయని పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యవసాయరంగం సాధించిన ప్రగతి నేడు యావత్ దేశానికి మార్గదర్శనంగా నిలిచిందని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయరంగాన్ని బలోపేతం చేసే దిశగా లక్షలాది కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్న ఒకే ఒక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. రాష్ట్రం అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఇప్పటివరకు రూ.2,16,000 కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేసిందని పేర్కొన్నారు. ఒకనాడు దండుగ అన్న వ్యవసాయం తెలంగాణలో నేడు పండుగ అయిందని, వ్యవసాయరంగాన్ని నమ్ముకుంటే జీవితానికి ధోకా లేదనే విశ్వాసం తెలంగాణ రైతుల జీవితాల్లో తొణికిసలాడుతున్నదనీ, ఇదే విశ్వాసాన్ని దేశ రైతాంగంలో పాదు కొల్పుతామని సిఎం స్పష్టం చేశారు. ఈ దిశగా యావత్ భారత ప్రజల సహకారంతో, సమిష్టి కృషితో దేశ వ్యవసాయ రంగ నమూనాను సమూలంగా మార్చి గుణాత్మక అభివృద్ధికి బాటలు వేయాల్సిన అవసరం వుందని పిలుపునిచ్చారు. ప్రజలంతా మకర సంక్రాంతి పండుగను సుఖసంతోషాలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలనీ, ప్రతీ ఇల్లు సిరి సంపదలతో తులతూగాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- సిపిఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సిపిఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్, చీటి భూపతిరావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాజస్థాన్, పంజాబ్, ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో ఆ ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని పేర్కొన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మాత్రం సీపీఎస్‌ను రద్దు చేయటం లేదని తెలిపారు. రాష్ట్రంలో సిపిఎస్‌ను ఒపిఎస్‌గా మార్చాలనీ, రెండు లక్షల మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పెన్షన్ రూల్స్ 1980 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 16న హైదరాబాద్‌లో సిపిఎస్ ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

సమాజం కోసం పాటుపడదాం..

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతికూల ఆలోచనలను వదిలేసి, దేశం కోసం, సమాజం కోసం పాటుపడదామంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని కెబిఆర్ పార్కు వద్ద భారత జాగృతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భోగి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పాత ఆలోచనలను భోగి మంటల్లో కాల్చేసి, సరికొత్త విధానాలతో ముందుకెళ్లాలని సూచించారు. తెలంగాణ జాగృతి, భారత జాగృతిగా రూపొందిన తర్వాత మొట్టమొదటి కార్యక్రమంగా సంక్రాంతి సంబరాలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. హరిదాసులు, బసవన్నల దీవెనలతో భారతదేశం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. శతాబ్దాల క్రితం మారిషస్‌కు వెళ్లి అక్కడ స్థిరపడిన తెలుగు సమాజం ప్రతినిధులు ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. మారిషస్‌లో తెలుగు సంస్కృతిని కాపాడేందుకు తరతరాలుగా కృషి చేస్తున్న మారిషస్ తెలుగు సంఘం ప్రతినిధులకు, అక్కడ నిర్వహించనున్న తెలుగు మహాసభలకు సహకారం ఉంటుందని కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మేడె రాజీవ్ సాగర్, భారత్ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, బిఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, భారత్ జాగృతి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అనంతుల ప్రశాంత్, మారిషస్ తెలుగు మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

పది లక్షలకు తగ్గొద్దు

- ఖమ్మం సభపై నేతలకు కెసిఆర్ ఆదేశాలు
- జన సమీకరణపై ప్రతి రోజూ దిశా నిర్దేశం
- మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ, ఎమ్మెల్సీ పల్లాకు పూర్తి బాధ్యతలు
- బిఆర్ఎస్ తొలి సభపై పూర్తిస్థాయి దృష్టి
- సభ తర్వాత మరింత ముమ్మరంగా కార్యాచరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఇప్పటిదాకా ఒక లెక్క.. ఇక ముందు మరో లెక్క...' అనే రీతిలో గులాబీ దళపతి కెసిఆర్... దూసుకెళ్తున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన కొందరు సీనియర్ నేతలు 'కాషాయ తీర్థం' పుచ్చుకోవటానికి రెడీ అవుతున్నారనే వార్తల నేపథ్యంలో ఆ పార్టీని ధీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా ఆయన సంసిద్ధమవుతున్నారు. దీంతోపాటు కేంద్రంలోని బిజెపి విధానాలపై విమర్శనాస్త్రాలను సంధించేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ క్రమంలో ఖమ్మంలో ఈనెల 18న నిర్వహించబోయే బిఆర్ఎస్ బహిరంగ సభపై ఆయన పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) పేరును భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్)గా మార్చిన తర్వాత నిర్వహిస్తున్న మొట్ట మొదటి సభ కావటంతో ఆయన ఆ మీటింగ్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఇప్పటిదాకా ప్లీనరీలు, బహిరంగ సభలు నిర్వహించిన సందర్భాల్లో లక్ష, రెండు లక్షలు, ఎక్కువలో ఎక్కువగా ఐదు లక్షల మంది జనాన్ని సమీకరించాలంటూ సిఎం పిలుపునివ్వటాన్ని గమనించాం. ఇప్పుడు అందుకు భిన్నంగా ఖమ్మం సభకు ఎట్టి పరిస్థితుల్లోనూ పది లక్షల మందిని సమీకరించాలంటూ ఆయన నేతలను ఆదేశించారు. ఇందుకనుగుణంగా మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌తోపాటు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డికి నిర్వహణా బాధ్యతలను ఆయన అప్పగించారు. ఇటీవల ఆ జిల్లాలో చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించటం, వైఎస్ఆర్ టిపి అధ్యక్షురాలు షర్మిల పాలేరు నియోజకవర్గంలో ఆఫీసును ఏర్పాటు చేయటం, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ శిబిరాలను నిర్వహించటం తదతర పరిణామాల నేపథ్యంలో... వాటన్నింటికీ ధీటుగా 'తగ్గేదేలే...' అన్నట్టుగా బిఆర్ఎస్ సభను నిర్వహించాలని కెసిఆర్ నిర్ణయించారు. ఆ కోణంలో దాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని... నేతలతో రోజూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆ సభ తర్వాత బిఆర్ఎస్ కార్యాచరణ, కార్యకలాపాలను మరింత ముమ్మరం చేయాలని ఆయన భావిస్తున్నారు.

మరోవైపు ఖమ్మంలో నిర్వహించబోయే సభకు నలుగురు ముఖ్యమంత్రులు పినరయి విజయన్ (కేరళ), స్టాలిన్ (తమిళనాడు), కేజ్రీవాల్ (ఢిల్లీ), భగవంత్‌మాన్ (పంజాబ్) హాజరు కానున్నారు. వీరితోపాటు యుపి మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్‌ను, కర్నాటక మాజీ సీఎం కుమారస్వామిని కూడా కెసిఆర్ ఆహ్వానించారు. ముఖ్యమంత్రులందరూ 18న హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్ల ద్వారా ఖమ్మం బయల్దేరి వెళతారు. కేరళ సీఎం పినరయి విజయన్ షెడ్యూల్ రీత్యా సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించాల్సిన సభకు... మధ్యాహ్నం మూడు గంటలకే ప్రారంభించనున్నారు. బహిరంగ సభలో ఆయనే మొదటగా ప్రసంగిస్తారు. అనంతరం విజయన్ ఖమ్మం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి విజయవాడకు వెళతారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో అదే రోజు సాయంత్రం తిరువనంతపురానికి చేరుకుంటారు. ఆయన వెంట సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కూడా సభకు హాజరవుతారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాతోపాటు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కూడా సభలో పాల్గొంటారు. రాష్ట్ర పర్యటన సందర్భంగా నలుగురు సీఎంలు హైదరాబాద్‌లోని నూతన సచివాలయాన్ని సందర్శిస్తారనే ప్రచారం కొనసాగినా... అందులో వాస్తవం లేదని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. కొత్త సెక్రటేరియట్‌లోని సీఎం ఛాంబర్‌ను ఈనెల 18న ప్రారంభిస్తారనే ప్రకటనలు వెలువడినా... ఖమ్మం సభ నేపథ్యంలో అది వాయిదా పడింది.

వికారాబాద్ స్టేషన్‌లో నిలిచిన పలు రైళ్లు

- కర్ణాటకలో పట్టాలు తప్పిన గూడ్స్‌బండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటకలోని చిత్తాపూర్ సులేహళ్లిలో గుడ్స్ రైలు పట్టాలు తప్పింది. దీంతో వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లు నిలిచిపోయాయి. ఈ క్రమంలో వికారాబాద్ మీదుగా వెళ్లే రైళ్లను రాయచూర్ వైపు దారి మళ్లిస్తున్నారు. కేఎస్ఆర్ బెంగళూరు, యశ్వంత్‌పూర్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లిస్తున్నారు.

అలాగే ఆర్‌టిసి బస్సులను తాండూరు మీదుగా నడపాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పండగ సమయం కావడం, గంటలపాటు రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులను అధికారులు తాండూర్ తరలిస్తున్నారు.

హైదరాబాద్‌లో ఎకోస్డ్ యూనిట్

ముంబయి : ప్యాకేజింగ్ ఉత్పత్తుల కంపెనీ ఎకోస్డ్ హైదరాబాద్‌లో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. దక్షిణాదిలో తమ ఉత్పత్తులకు ఉన్న డిమాండ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎకోస్డ్ వ్యవస్థాపకులు, ఎండి నితిన్ కల్లా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో సంఘటిత పల్లెట్ తయారీ సంస్థ తమదేనని నితిన్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు 7 లక్షలకుపైగా ఈ ఉత్పత్తులను డెలివరీ చేశామన్నారు. అయితే నూతన ప్లాంట్‌ను ఎక్కడ, ఎంత మొత్తంలో ఏర్పాటు చేసేది ఆ కంపెనీ వెల్లడించలేదు. ఇప్పటికే ఈ సంస్థకు పంజాబ్, మహారాష్ట్ర, హర్యానాలో ప్లాంట్లు ఉన్నాయి.

హైకోర్టు తీర్పును అమలు చేయాలి

- డిఎస్‌సి-2008 బిఇడి సెలెక్టెడ్ మెరిట్ అభ్యర్థులను ఎస్‌జిటిలుగా నియమించాలి
- సిఎం కెసిఆర్‌కు జూలకంటి రంగారెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిఎస్‌సి-2008 బిఇడి సెలెక్టెట్ మెరిట్ అభ్యర్థుల విషయంలో హైకోర్టు ఇచ్చిన తుది తీర్పును అమలు చేస్తూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా నియమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిఎం కెసిఆర్‌కు లేఖ రాశారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల భర్తీ కోసం బిఇడి, డిఇడి అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పిస్తూ 2008 డిసెంబర్ 6న నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం జిఒ 28 ద్వారా డిఇడి అభ్యర్థులకు నియామకాల్లో 30 శాతం రిజర్వేషన్ కల్పించడంతో అప్పటికే ఎంపికైన మెరిట్ బిఇడి అభ్యర్థులు నష్టపోయారని తెలిపారు. దీనిపై హైకోర్టు 2022 సెప్టెంబర్ 27న బిఇడి సెలెక్టెడ్ మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలనీ, 2008లో నోటిఫికేషన్ అనంతరం ఇచ్చిన జిఒ ద్వారా నిబంధనలు మార్చడం చెల్లవనీ, ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్న మొత్తం పోస్టులు మెరిట్ బి.ఇడి అభ్యర్థులతో భర్తీ చేయాలని ఆదేశించిందని పేర్కొన్నారు. 2016 జనవరిలో వరంగల్ పర్యటన సందర్భంగా ఉద్యోగాలిస్తామనీ, నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేస్తామంటూ సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బిజెపి హఠావో.. సింగరేణి బచావో..

- 18న బిఆర్ఎస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"బిజెపిలోచేరడమంటే వారి రాజకీయ భవిష్యత్తు ముగిసినట్టే.. ఖమ్మం ఉమ్మడి జిల్లాలో బిజెపికి చోటు లేదన్నారం. డిపాజిట్ కూడా దక్కదు.. బిజెపిలోకి వెళ్లితే ఆత్మహత్యా సదృశ్యమే.. తల్లిలాంటి పార్టీకి ఎవరూ ద్రోహం చేయొద్దు.. బిజెపి హఠావో.. సింగరేణి బచావో" అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండల పరిధిలోని బొజ్జాయిగూడెం ఎస్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 18న ఖమ్మంలో జరగనున్న బీఆర్ఎస్ భారీ సభకు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సిపిఎం, సిపిఐ జాతీయ నేతలు రానున్నారని తెలిపారు. సభకు 5లక్షల మందిని సమీకరించి కేసీఆర్ సత్తా ఢిల్లీ దాక చాటాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు, ఎల్ఐసి, బొగ్గు గనులు తదితర ప్రభుత్వ రంగాలను ప్రయివేటుకు ధారాదత్తం చేస్తోందన్నారు. లక్షల ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఉన్నవి ఊడగొడుతోందన్నారు. అదానీ, అంబానీలకే మోడీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందని విమర్శించారు. తెలంగాణలో అనేక ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నామన్నారు. మొత్తం 91 వేల ఉద్యోగాలు భర్తీ చేయనున్నామని చెప్పారు. దేశంలో ప్రకటించిన 10 ఉత్తమ పంచాయతీలు తెలంగాణలోనే ఉన్నాయన్నారు. దీన్ని బట్టి రాష్ట్రంలో పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక బొగ్గుట్టను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. సీతారామ ప్రజెక్టుతో నియోజకవర్గంలోని 5 మండలాలకు నీరందించేందుకు రూ.400 కోట్ల ప్యాకేజీని సిఎం ప్రకటించారని గుర్తు చేశారు. ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు మరిన్ని నిధులిచ్చి 100 పడకలకు పెంచుతామని చెప్పారు. ఎమ్మెల్యే హరిప్రియ అధ్యక్షతన జరిగిన సభలో ప్రభుత్వ చీఫ్ విప్ రేగా కాంతారావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ, రాజ్యసభ సభ్యులు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- రూ.4.50లక్షలకు అమ్మిన నిందితులు
- బాలుడిని తల్లికి అప్పగించిన భద్రాచలం పోలీసులు
- ఆరుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలుడి కిడ్నాప్ కేసును భద్రాచలం పోలీసులు ఛేదించారు. రూ.4.50కు అమ్మిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను భద్రాచలం ఎఎస్‌పి రాజేష్ చంద్ర శనివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. భద్రాచలానికి చెందిన మూడో తరగతి చదువుతున్న బాలుడు జనవరి 6న కిడ్నాప్ అయ్యాడు. బాలుడి తల్లి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారించారు. సిసి ఫుటేజీలను పరిశీలించారు. వాటి ఆధారంగా విచారించగా పలు విషయాలు వెలుగుచూశాయి. భద్రాచలం పట్టణం అశోక్‌నగర్ కాలనీకి చెందిన కందుల అన్నపూర్ణ, ఆమె రెండో కూతురు అనూష, కొడుకు సాయిరాం తదితరులు డబ్బుపై అత్యాశతో భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో బాలుడిని కిడ్నాప్ చేసి అమ్మాలని పథకం రచించారు. ఈ క్రమంలో వారు రాజమండ్రికి చెందిన బెండ తులసి ద్వారా డాక్టర్ స్నేహలత, ఇస్సాక్‌కు బాలుడిని అమ్మేందుకు రూ.4.50 లక్షలకు డీల్ కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో కందుల అన్నపూర్ణ, కూతురు అనూష, సాయిరాం కొంతకాలంగా ఆ బాలుడిని మచ్చిక చేసుకున్నారు. అతని ఫొటోలను డాక్టర్ స్నేహలత, ఇస్సాక్ దంపతులకు పంపారు. వారి పథకంలో భాగంగా డిసెంబర్ 22న బాలుడిని రాజమండ్రి తీసుకెళ్లి.. అదే రోజు భద్రాచలం తీసుకొచ్చారు. అనంతరం జనవరి 6న నిందితులు ముగ్గురూ కలిసి బాలుడిని కిడ్నాప్ చేసి రాజమండ్రి తీసుకెళ్లారు. బెండ తులసి ద్వారా డాక్టర్ స్నేహలత, ఇసాక్ దంపతులకు బాలుడిని రూ.4.50 లక్షలకు అమ్మారు. అందులో బెండ తులసికి రూ.50 వేలు ఇచ్చారు. జనవరి 14న కందుల అన్నపూర్ణ, అనూష, సాయిరాంను భద్రాచలం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ స్నేహలత, ఇస్సాక్, బెండ తులసిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.3.10 లక్షలు, 6 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. చైల్డ్ లైన్, డిసిపి యూనిట్ భద్రాద్రి కొత్తగూడెం అధికారుల సమక్షంలో బాలుడిని తల్లికి అప్పగించినట్టు ఎఎస్‌పి వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపుతామన్నారు.

విద్యా కమిషన్‌ను నియమించాలి

- 37 తీర్మానాలకు టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర మహాసభ ఏకగ్రీవ ఆమోదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాఠశాల విద్యలో సమస్యలను అధ్యయనం చేసేందుకు విద్యాకమిషన్‌ను నియమించాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని కోరింది. రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో ఉన్న బిఎంఆర్ సార్థ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ప్రారంభమైన టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ఐదో మహాసభ శనివారం రెండోరోజు కొనసాగింది. విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమం, పలు సమస్యలపై 37 తీర్మానాలను రాష్ట్ర మహాసభలో ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జాతీయ విద్యావిధానం-2020ని రద్దు చేయాలని డిమాండ్ చేసింది. పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను వెంటనే నియమించాలని కోరింది. స్వీపర్, అటెండర్, వాచ్‌మెన్, క్లరికల్ పోస్టులను మంజూరు చేయాలని తెలిపింది. మన ఊరు-మనబడి, మనబస్తీ-మనబడి కార్యక్రమానికి తగిన నిధులను విడుదల చేసి కాలపరిమితిలోగా పనులను పూర్తి చేయాలని సూచించింది. ఇంగ్లీష్ మీడియం బోధనకు ఉపాధ్యాయులకు కావాల్సిన నైపుణ్యాలను పెంచాలనీ, అదనపు ఉపాధ్యాయులను నియమించాలని కోరింది. ఎఫ్ఎల్ఎన్ అమల్లో సమస్యలను పరిష్కరించాలని పేర్కొంది. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరింది. ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనీ, అన్ని విధాలుగా వాటిని అభివృద్ధి చేయాలని తెలిపింది. రెగ్యులర్ డిఇఒ, డిప్యూటీ ఇఒ, ఎంఇఒ పోస్టులను మంజూరు చేసి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేసింది. ఎంఆర్‌సి స్కూల్ కాంప్లెక్స్‌లను బలోపేతం చేయాలని పేర్కొంది. పాఠశాల యాజమాన్య కమిటీలను బలోపేతం చేసి పాఠశాల అభివృద్ధిలో సంపూర్ణ భాగస్వాములయ్యే విధంగా విధానాలు రూపొందించి అమలు చేయాలని కోరింది. పాఠశాలల్లో అన్ని స్థాయిల్లోనూ కంప్యూటర్ విద్యను అందించాలని సూచించింది. విద్యార్థులకు నాలుగు జతల బట్టలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, చెప్పులు, బెల్టు, బ్యాడ్జీ, ఐడి కార్డులను ప్రభుత్వమే ఉచితంగా అందించాలని తెలిపింది. బాలికలకు హెల్త్ కిట్లను అందించాలని పేర్కొంది. గురుకులాలు, కెజిబివిలు, మోడల్ స్కూళ్లు, హాస్టళ్లు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్‌చార్జీలను కనీసం 30 శాతం పెంచి పౌష్టికాహారం అందించాలని కోరింది. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని తెలిపింది. 317 జీవో కారణంగా ఏర్పడిన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరింది. ఈహెచ్ఎస్ పథకంలో నగదు రహిత వైద్యాన్ని సమగ్రంగా అమలు చేయాలని పేర్కొంది. జీపీఎఫ్ ఖాతాలను కొత్త జిల్లాలకు బదిలీ చేయాలని తెలిపింది. మెడికల్ రీయింబర్స్‌మెంట్ గరిష్ట మొత్తాన్ని రూ.ఐదు లక్షలకు పెంచాలని సూచించింది. పాఠశాల విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న వ్యక్తిగత, ఇతర ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని కోరింది. పారదర్శకత కోసం సిటిజన్ చార్టర్‌ను ప్రకటించి అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతినెలా మొదటి తేదీన జీతాలు చెల్లించాలని, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని తెలిపింది. 2004 సెప్టెంబర్ ఒకటి కంటే ముందే ఎంపికై, ఆ తర్వాత నియామకమైన డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా పాత పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేసింది. క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ బోధకుల సమస్యలను పరిష్కరించాలని తెలిపింది. విద్యా, వైద్య రంగాలను పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే నిర్వహించి అందరికీ సమానమైన, నాణ్యమైన విద్యావైద్యాన్ని ప్రజలందరికీ ఉచితంగా అందించాలని పేర్కొంది. ప్రభుత్వ రంగంలోని అన్ని శాఖల్లోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెలిపింది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పేర్కొంది. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపీ)ని ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని కోరింది. పాఠశాలల్లో ఉపాధ్యాయులపై మతోన్మాద మూకదాడులను అరికట్టాలని డిమాండ్ చేసింది.

మరో డ్రగ్ పెడ్లర్ అరెస్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగరంలో మరో డ్రగ్ పెడ్లర్ స్టీఫెన్ డిసౌజాను పోలీసులు అరెస్ట్ చేశారు. గోవాలో డిసౌజా క్లబ్ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఓ కేసులో హైదరాబాద్ పోలీసుల ఎదుట నిందితుడు హాజరయ్యాడు. డిసౌజాను గోవా పోలీసులు అరెస్ట్ చేశారు. గోవాలో హిల్‌టాప్ క్లబ్ మాటున డ్రగ్స్ విక్రయాలు జరుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు.

బిజెపి, కాంగ్రెస్‌కు స్థానం లేదు

మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు స్థానం లేదని ఆర్థికమంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మతతత్వ బిజెపికి కనీసం డిపాజిట్లు కూడా రావన్నారు. ఎవరైనా బిజెపి గురించి ఆలోచిస్తే తమ గోతిలో తాము పడ్డట్టేనని.. ఆ పార్టీలోకి వెళ్తామనుకోవడం ఆత్మహత్యా సదృశ్యమేనన్నారు. ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించబోయే బిఆర్ఎస్ బహిరంగ సభకు మద్దతుగా ఇల్లెందులో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ అమ్మి ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్న చరిత్ర కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిదన్నారు. సింగరేణిని అప్పుల కుప్పలోకి నెట్టి.. కార్పొరేట్లకు అప్పగించాలన్నదే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు.సింగరేణిని కాపాడుకోవాలంటే.. బిజెపికి అవకాశం ఇవ్వొద్దని కోరారు. దేశంలో బిజెపిని కూకటివేళ్లతో పెకిలించి ప్రభుత్వ రంగ సంస్థల్ని కాపాడుకుందామన్నారు. 14 ఏళ్ల పోరాడి లక్ష్యాన్ని చేరుకుని రాష్ట్రం సాధించిన కెసిఆర్.. తెలంగాణను 28 రాష్ట్రాల కన్నా ముందుంచారని తెలిపారు.

నిండాముంచిన 'లాంగ్‌జంప్'

- 4 మీటర్లు దూకినా ఎంపిక చేయని వైనం
- షాట్‌పుట్ 6 మీటర్లు వేసినా అర్హత పొందలే
- పరుగుపందెంలో రాణించినా కొలువుకు దూరం
- ఆర్మీకి కూడా లేని నిబంధనలు అమలు
- 'పోలీసు' అభ్యర్థుల గోస పట్టని సర్కారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ నియామక ప్రక్రియలో నిబంధనల ప్రకారం దేహదారుఢ్య పరీక్షల్లో చిన్నచిన్న కారణాలతో అనర్హులుగా ప్రకటించడం పట్ల వేలాది మంది అభ్యర్థులు మనోవేదనకు గురవుతున్నారు. కొన్నేండ్ల నుంచి ఇంటిని వదిలి ప్రాక్టీస్ చేసినా అడ్డగోలు నిబంధనలతో సర్కారు తమ జీవితాలతో చెలగాటమాడిందని కుమిలిపోతున్నారు. లాంగ్‌జంప్ అభ్యర్థులను నిండాముంచింది. ఆర్మీకి కూడా లేని నిబంధనలను పోలీసు కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థులకు వర్తింపచేశారు. పురుషులు 1,600 మీటర్లు, మహిళలు 800 మీటర్లు పరుగుపందెంలో అర్హత సాధించినా లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో అనర్హులు కావడం గమనార్హం. గత నోటిఫికేషన్‌లో ఉన్న నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక బోర్డు పూర్తిగా మార్చాయి. అవే అభ్యర్థులకు శాపంగా పరిణమించాయి. గత నోటిఫికేషన్‌లో పురుషుల పరుగుపందెం 800 మీటర్లు ఉండేది. దాన్ని అధికారులు 1,600 మీటర్లకు పెంచారు. మహిళల పరుగుపందెం గతంలో 100 మీటర్లు ఉంటే, దాన్ని 800 మీటర్లకు పొడిగించారు. పురుషులకు లాంగ్‌జంప్ దూరాన్ని 3.8 మీటర్ల నుంచి నాలుగు మీటర్లకు పెంచారు. షాట్‌పుట్ దూరాన్ని 5.6 మీటర్ల నుంచి ఆరు మీటర్లకు పొడిగించారు. మహిళలకు 3.75 మీటర్ల దూరాన్ని నాలుగు మీటర్లకు పెంచారు. పరుగుపందెంలో (పురుషులు 1,600 మీటర్లు, మహిళలు 800 మీటర్లు) అర్హత పొందినా లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో అర్హత సాధించకపోవడంతో వేలాది మంది అభ్యర్థులు కొలువుకు దూరమయ్యారు. ఇంకోవైపు నోటిఫికేషన్‌లో ప్రకటించిన నిబంధనల ప్రకారం పురుషులు లాంగ్‌జంప్ నాలుగు మీటర్లు దూకినా కూడా వారిని మెయిన్స్ రాతపరీక్షలకు ఎంపిక చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగు మీటర్ల కంటే ఎక్కువ దూకిన వారినే అధికారులు ఎంపిక చేశారు. ఇక షాట్‌పుట్ ఆరు మీటర్ల దూరం వేసిన వారు కూడా అర్హత పొందలేకపోయారు. ఆరు మీటర్ల కంటే ఎక్కువ దూరం వేసినోళ్లనే మెయిన్స్ రాతపరీక్షలకు ఎంపిక చేశారు.

గతంలో సులభంగా మెయిన్స్‌కు ఎంపిక

రాష్ట్రంలో 17,516 పోలీసు కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు 5,07,890 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో ప్రిలిమినరీ రాతపరీక్షలో 2,07,106 మంది అర్హత సాధించారు. ఈవెంట్లు నిర్వహించిన తర్వాత మెయిన్స్ రాతపరీక్షలకు 1,11,209 మందిని పోలీసు నియామక బోర్డు ఎంపిక చేసింది. వారికి మార్చి 12 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు రాతపరీక్షలను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. పాత పద్ధతిలో ఈవెంట్లను నిర్వహిస్తే అభ్యర్థులు సులభంగా మెయిన్స్ రాతపరీక్షలకు ఎంపికయ్యే అవకాశముండేది. గత నోటిఫికేషన్‌లో ప్రిలిమినరీ రాతపరీక్షలో అర్హత పొందిన వారికి ఐదు రకాల ఈవెంట్లను నిర్వహించేవారు. అందులో పురుషులకు 800 మీటర్లు, వంద మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్, హైజంప్ ఉండేవి. అందులో 800 మీటర్ల పరుగుపందెంలో అర్హత సాధించడం తప్పనిసరి. మిగిలిన నాలుగు ఈవెంట్లలో రెండు అర్హత పొందితే మెయిన్స్ రాతపరీక్షలకు ఎంపికవుతారు. అప్పుడు అభ్యర్థులకు చాయిస్ ఉండేది. కానీ ఇప్పుడు 800 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్ ఈ మూడు ఈవెంట్లలోనూ తప్పనిసరిగా అర్హత పొందాలి. ఒక్క దాంట్లో అర్హత లేకపోయినా మెయిన్స్ రాతపరీక్షలు రాసే అవకాశాన్ని కోల్పోతారు. దీంతో ఉద్యోగానికి దూరమవుతారు. ఇక మహిళలకు సంబంధించి గతంలో వంద మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్ ఈవెంట్లను నిర్వహించారు. అందులో వంద మీటర్ల పరుగుపందెంతో తప్పనిసరిగా అర్హత సాధించాలి. మిగిలిన రెండింటిలో ఒకదాంట్లో అర్హత పొందితే మెయిన్స్ రాతపరీక్షలు రాసేందుకు ఎంపికయ్యే వారు.

కానీ ఇప్పుడు 800 పరుగుపందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్ మూడు ఈవెంట్లనూ తప్పనిసరి చేశారు. అయితే ఎలాంటి చాయిస్ లేకుండా నిబంధనలు రూపొందించడం వేలాది మంది అభ్యర్థులు అన్యాయానికి గురవుతున్నారు. పాతపద్ధతిలోనే ఈవెంట్లను నిర్వహిస్తే వేలాది మంది అభ్యర్థులు మెయిన్స్ రాతపరీక్షలకు ఎంపికయ్యే అవకాశముండేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరుగుపందెంలో అర్హత పొందిన (పురుషులు, మహిళలు) అభ్యర్థులందరినీ మెయిన్స్ రాతపరీక్షలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మాకు న్యాయం చేయాలి : శ్రీకాంత్, కరీంనగర్



పోలీసు నియామక బోర్డు తప్పిదం వల్ల మాకు అన్యాయం జరిగింది. నాలుగు మీటర్ల లాంగ్‌జంప్ దూకినా అనర్హులుగా ప్రకటించడం సరైంది కాదు. పరుగుపందెంలో అర్హత పొందిన వారికి సివిల్, ఎక్సైజ్, ఫైర్, జైల్, వార్డెన్, డ్రైవర్, కమ్యూనికేషన్ పోస్టులు పొందేందుకు మెయిన్స్‌కు ఎంపిక చేయాలి. దానివల్ల రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు నియామక బోర్డుకు ఎలాంటి ఇబ్బంది లేదు.

4 మీటర్లు దూకినా అనర్హులుగా ప్రకటించారు : మహేష్, నాగర్‌కర్నూల్

నేను మూడుసార్లు నాలుగు మీటర్ల గీత వద్ద లాంగ్‌జంప్ దూకాను. అయినా నన్ను అనర్హులుగా ప్రకటించారు. నాలుగు మీటర్ల కంటే ఎక్కువ దూరం దూకాలనడం సరైంది కాదు. ఆ నిర్ణయం వల్ల నేను ఉద్యోగం కోల్పోయాను. పరుగుపందెంలో అర్హత పొందిన నన్ను మెయిన్స్ రాతపరీక్షలకు ఎంపిక చేయాలి.

షాట్‌పుట్ 6 మీటర్ల గీత మీద వేశాను : సోమేశ్, నల్లగొండ

షాట్‌పుట్ ఆరు మీటర్ల గీత మీద వేశాను. అయినా అనర్హులు ప్రకటించడం అన్యాయం. డీఎస్పీని రివ్యూ చేయాలని కోరినా స్పందించలేదు. గ్రౌండ్ నుంచి బలవంతంగా బయటికి పంపారు. మాకు న్యాయం చేయాలి.

మూత్రవిసర్జనకూ అవకాశమివ్వలేదు : బోద బాబురావు, మహబూబాబాద్

పరుగుపందెం అర్హత సాధించాను. నాకు మూత్రం వస్తుందంటూ అధికారులను వేడుకున్నా వెళ్లేందుకు అవకాశమివ్వలేదు. దీంతో ఈవెంట్లపై పూర్తిగా కేంద్రీకరించలేకపోయాను. అయినా లాంగ్‌జంప్ ఐదు మీటర్లు దూకినా ఫౌల్ పేరుతో అనర్హునిగా ప్రకటించారు.

రివ్యూ అడిగినా అవకాశం కల్పించలేదు. సీసీ ఫుటేజీ బయటపెట్టాలి. లేదంటే మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తాం.

పండుగను ఆనందంగా జరుపుకోవాలి : స్పీకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి ప్రజలకు మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలతో "భోగి"ని, సకల సంపదలతో "సంక్రాంతి"ని, కన్నుల పండుగగా "కనుమ"ను జరుపుకోవాలని కోరారు. సంక్రాంతి రైతుల పండుగ. వానాకాలం పంటల కోతలు పూర్తయి ధాన్యం ఇంటికి చేరిన సమయంలో జరుపుకునే పండుగ సంక్రాంతి. భోగి మంటలు, గాలి పటాల సందళ్ళతో పాటుగా తెలంగాణ సంప్రదాయ సకినాల పిండివంటలతో ఈ మూడు రోజులు కోలాహలంగా ఉంటుంది. ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని పోచారం కోరారు.

ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలి

- తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిసిసి అధ్యక్షులు ఎ.రేవంత్ రెడ్డి తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని కోరుకున్నారు. ఈ సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందపు సిరులు కురిపించాలని ఆకాంక్షించారు.

చౌదరి సంతోఖ్ సింగ్‌కు నివాళులు

కాంగ్రెస్ పార్టీ జలంధర్ ఎంపీ చౌదరీ సంతోఖ్ సింగ్ పార్థీవ దేహానికి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. భారత్ జోడో యాత్రలో గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించిన విషయం తెలిసిన వెంటనే రేవంత్ హుటాహుటీన పంజాబ్ బయలుదేరి వెళ్లారు. సంతోష్ సింగ్ చౌదరి కుమారుడు విక్రమ్ సింగ్ చౌదరీతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కుటుంబానికి తన సానుభూతిని తెలిపారు.

క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలి

- డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రతి మండలంలోనూ క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం నోముల గ్రామంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడోత్సవాలను స్థానిక సిఐ వెంకటేశంగౌడ్‌తో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల వేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ పోరాటాల్లో యువకులు భాగం కావాలని కోరారు. అనంతరం సిఐ వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర అశోక్ పాల్గొన్నారు.

సమాజం కోసం పాటుపడదాం..

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతికూల ఆలోచనలను వదిలేసీ, దేశం కోసం, సమాజం కోసం పాటుపడదామంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని కెబిఆర్ పార్కు వద్ద భారత జాగృతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భోగి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పాత ఆలోచనలను భోగి మంటల్లో కాల్చేసి, సరికొత్త విధానాలతో ముందుకెళ్లాలని సూచించారు. తెలంగాణ జాగృతి, భారత జాగృతిగా రూపొందిన తర్వాత మొట్టమొదటి కార్యక్రమంగా సంక్రాంతి సంబరాలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. హరిదాసులు, బసవన్నల దీవెనలతో భారతదేశం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. శతాబ్దాల క్రితం మారిషస్‌కు వెళ్లి అక్కడ స్థిరపడిన తెలుగు సమాజం ప్రతినిధులు ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. మారిషస్‌లో తెలుగు సంస్కృతిని కాపాడేందుకు తరతరాలుగా కృషి చేస్తున్న మారిషస్ తెలుగు సంఘం ప్రతినిధులకు, అక్కడ నిర్వహించనున్న తెలుగు మహాసభలకు సహకారం ఉంటుందని కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మేడె రాజీవ్ సాగర్, భారత్ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, బిఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, భారత్ జాగృతి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అనంతుల ప్రశాంత్, మారిషస్ తెలుగు మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం

- విద్య, ఉపాధ్యాయ అంశాలపై చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఐదో మహాసభ శనివారం విజయవంతంగా ముగిసింది. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లోని బీఎమ్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లోని కామ్రేడ్ నాగటి నారాయణనగర్, కామ్రేడ్ ముంత ఆంజనేయులు ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమైన మహాసభ ఉత్సాహపూరితమైన వాతావరణంలో రెండ్రోజులపాటు నడిచింది. విద్యార్థి, ఉపాధ్యాయ సంక్షేమాలపై సుదీర్ఘమైన చర్చ జరిగాయి. మహాసభ ఎంత ఉత్సాహంతో ప్రారంభమైందో అంతే ఒరవడితో భవిష్యత్ కార్యాచరణపై ప్రతినిధుల చర్చ కొనసాగింది. మహాసభకు పెద్ద సంఖ్యలో హాజరైన ఉపాధ్యాయులు.. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు రాగన్నగూడెం నుంచి ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సభా ప్రాంగణంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు పతాకాలను ఎగురవేశారు. అమరులను స్మరిస్తూ అమరవీరుల స్థూపానికి ఈ మహాసభకు హాజరైన కేరళ ప్రభుత్వ విప్ కేకే శైలజా టీచర్ పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మహాసభను ప్రారంభించారు. అదేవిధంగా మహాసభకు హాజరైన విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు, పలువురు వ్యక్తులు ఉపాధ్యాయ, విద్యార్థి సంక్షేమంపై ప్రసంగించారు. ప్రతినిధుల సభలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో రెండేండ్లలో చేసిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు, లోపాలు, జిల్లా కమిటీల పని విధానం, ఇలా పలు అంశాలపై రాష్ట్ర కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. రాష్ట్ర కార్యదర్శి నివేదికపై శుక్ర, శనివారం ఉదయం వరకు చర్చలు జరిగాయి. ఆయా జిల్లాల ప్రతినిధులు పలు అంశాలపై ప్రశ్నించగా.. కార్యదర్శి సమాధానం ఇచ్చారు. అనంతరం విద్యార్థి, ఉపాధ్యాయ సంక్షేమం, ఉపాధ్యాయుల సమస్యలు, సర్కారు బడుల బలోపేతం, ఇలా 23 అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, తీర్మానాలు చేశారు. భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. అనంతరం నూతన కార్యదర్శి వర్గాన్ని ఎన్నుకున్నారు.

ఆలోచన రేకెత్తించే విధంగా సభా ప్రాంగణం

సమావేశ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హోర్డింగ్స్‌పై కొటేషన్స్ ప్రతినిధులను ఆలోచింపజేశాయి. 'బిడ్డల పాలకై బిచ్చమెత్తు దేశంలో రాళ్లకు పాలిచ్చు కథ నశించునదెన్నడో.. పేడకు బొట్టెట్టి దైవమని పూజించినవారు పేదను గుర్తించగ మారబోవునదెన్నెడో.. ఎప్పుడొచ్చును దేశానికి చైతన్యం అది తెచ్చుట కదా మన కర్తవ్యం' అనే కొటేషన్స్ ఆలోచింపచేశాయి. 'ఉపాధ్యాయులుగా మీ హక్కులకై పోరాడండి.. అదే సమయంలో సామాన్యుల పోరాటాలలో భుజం భుజం కలపండి' అని పుచ్చలపల్లి సుందరయ్య వాక్యం, 'మతం అనేది వ్యక్తిగత విషయం.. తనకిష్టం వచ్చిన మతాన్ని విశ్వసించేందుకు, పూర్తి స్వేచ్ఛ ఉంది' అన్న వివేకానంద కొటేషన్స్ ఆలోచింపచేశాయి.

విజ్ఞాన భాండాగారం.. ఉద్యోగ కర్మాగారం

- ఒయు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ లైబ్రరీ
- పలు విభాగాల్లో పరిశోధనకు పెద్దన్న పాత్ర
- పోటీ పరీక్షలకు పెట్టింది పేరు
- చరిత్ర, సామాజికతను ప్రస్ఫుటించే పుస్తకాల డిజిటలైజేషన్
- 60 వసంతాలు పూర్తి చేసుకున్న గ్రంథాలయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ భారతదేశంలో అతి పురాతన, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన విశ్వవిద్యాలయం ఒయు. ఏడో నిజాం రాజు "మీర్ ఉస్మాన్ అలీఖాన్" కాలంలో నిర్మించిన యూనివర్సిటీ. లక్షలాది మంది మేధావులను ప్రపంచానికి అందించిన పోరుగడ్డ ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఈ వర్సిటీకి ఇంతటి పేరు ప్రఖ్యాతలు తీసుకురావడంలో విజ్ఞాన భాండాగారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ గ్రంథాలయం కీలక భూమిక పోషిస్తోంది. రాజ సౌధాన్ని తలపించే వర్సిటీ.. చారిత్రక సంపదను, విజ్ఞానాన్ని పంచుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఒయు విశ్వవిద్యాలయం లైబ్రరీ పాత్ర కీలకమైంది. రాష్ట్రంలో ఉన్నత విద్యకు సంబంధించిన కీలకమైన విధానాలు పురుడు పోసుకునేది ఇక్కడే. ఇంతటి గొప్ప పేరు ప్రఖ్యాతలుగాంచిన ఈ గ్రంథాలయం 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా "ప్రజాశక్తి" ప్రత్యేక కథనం.

1918 నుంచి ఒయులో గ్రంథాలయ సేవలు ఉన్నప్పటికీ ప్రధాన గ్రంథాలయం సేవలు 1963 ఆగస్టు 3న ప్రారంభమయ్యాయి. నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చేతుల మీదుగా ప్రారంభించిన ఈ గ్రంథాలయాన్ని వర్సిటీలోని పలు విభాగాల విద్యార్థులకు, పరిశోధకులకు ఉపయోగపడేలా ఏర్పాటు చేశారు.

ఆయా విభాగాల ఆధారంగా సేవలు

వర్సిటీలోని ఆయా విభాగాల ఆధారంగా లైబ్రరీ పలు సేవలు అందిస్తున్నది. ప్రధానంగా ఆర్డరింగ్, టెక్నికల్ స్పాట్ పరియాడికల్ ఇంటర్నెట్ థీసిస్, సిఇఆర్ఎల్ (1997), యుస్ సెక్షన్(1968), మాన్యుస్క్రిప్ట్‌లు, విజన్ ఆఫ్ ఒయు తదితర విభాగాలు ఉన్నాయి. అంతేకాకుండా ఈ లైబ్రరీలో నాలెడ్జ్ సర్క్యులేషన్, రిఫరెన్స్, డిజిటల్ లైబ్రరీ తదితర సేవలు అందుబాటులో ఉన్నాయి. దీనిలో భాగంగానే విజన్ ఆఫ్ ఒయు కంప్యూటర్ ల్యాబ్‌ను నాటి ఒయు విసి ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ హయాంలో ప్రారంభించారు.

నిరంతరం సేవలు

విద్యార్థుల అవసరాలకు తగిన విధంగా ఒయు లైబ్రరీలో మరిన్ని సేవలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగానే విద్యార్థులు చదువుకోవడానికి 14 గంటలు సేవలు అందిస్తున్నది. ఈ సౌకర్యాన్ని 2015లో నాటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సురేష్‌కుమార్ అందుబాటులోకి తీసుకొచ్చారు. పోటీ పరీక్షల దృష్ట్యా ఈ సేవలను తీసుకొచ్చారు. ఈ లైబ్రరీతోపాటు ఒయులో పలు విభాగాల కళాశాలల్లోనూ గ్రంథాలయాలు ఉన్నాయి. వర్సిటీలో ఆర్ట్స్, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్, మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ తదితర గ్రంథాలయాలు అందుబాటులో ఉన్నాయి. అన్నింటికీ మూలాధారం ఒయు ప్రధాన గ్రంథాలయమే. ఏడాదిలో ప్రధాన పండుగలు మినహా అన్ని రోజులూ తెరిచే ఉంటుంది. ఇక్కడ ఉద్యోగులు నిరంతరం సేవలు అందిస్తున్నారు.

విద్యార్థులకు సౌకర్యంగా ల్యాబ్

విద్యార్థులకు వారి పాఠ్యాంశాలతోపాటు వివిధ అంశాలపై విజ్ఞానం పెంచేలా ఇక్కడ పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. నిరంతరం విజ్ఞానాన్ని ఆధునీకరిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగానే ప్రధాన పుస్తకాలను డిజిటలైజేషన్ చేస్తున్నారు. పురాతన పుస్తకాలను ఆధునీకరించి జాగ్రత్త పరుస్తున్నారు. ఇక్కడ గ్రంథాలయంలో 25 కంప్యూటర్లతో కూడిన అత్యాధునిక ల్యాబ్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎప్పటికప్పుడూ సమాచారాన్ని అందిపుచ్చుకోవడానికి ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు

ఈ గ్రంథాలయంలో ప్రధానంగా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువుగా అందుబాటులో ఉంచారు. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు ప్రచురితమైన అన్ని రకాల పుస్తకాలను సేకరించి భద్రపరిచారు. పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాంపిటీషన్ రెఫరెన్స్ సెల్‌లో వీటిని పొందుపరిచారు. ఇది రోజూ రాత్రి 11 గంటల వరకు పనిచేస్తుంది.

ఆధునిక దేవాలయం మా గ్రంథాలయం
గ్రంథపాలకుడు డాక్టర్ ఎ.ఎస్.చక్రవర్తి

స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు ఈ గ్రంథాలయం ప్రధాన భూమిక పోషించింది. ఎంతో మంది జీవితాలకు దిశా నిర్దేశం చేసిన ఘనత మా గ్రంథాలయానిది. ఆధునిక దేవాలయం మా గ్రంథాలయం. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా గ్రంథాలయంలో అనేక మార్పులు చేర్పులు తీసుకొచ్చాం. వారి ఉపాధియే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఇప్పటి వరకు 45 పుస్తకాలు డిజిటలైజ్ చేసి నెట్‌లో అందుబాటులో ఉంచారు. 6825 మ్యాన్ స్క్రిప్ట్స్, 10, 11వ శతాబ్దాలకు సంబంధించిన తాళపత్ర గ్రంథాలను డిజిటలైజేషన్ చేశాం. అల్ మజీద్ సెంటర్ ఫర్ హెరిటేజ్ అండ్ కల్చర్ (దుబాయ్) సహకారంతో డిజిటలైజేషన్ పూర్తి చేశాం.

ఇక్కడ ఉన్న పుస్తకాల వివరాలు

పుస్తకాలు :- 5,57,007
థిసెస్, ఎంఫిల్ :- 75387
ఐరాస పత్రాలు :- 13195
మాన్యుస్క్రిప్ట్, తాళపత్ర గ్రంథాలు -6825
ఐలిమ్స్ :- 273
సీడీ రోమ్స్ :-12
డిజిటలైజేషన్ డాక్యుమెంట్స్ :-45,000

పారిశ్రామికాభివృద్ధికి నిధులు కేటాయించండి

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి కెటిఆర్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ పారిశ్రామిక రంగాభివృద్ధికి తెలంగాణ ఎంతో కీలకమని,రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి కెటిఆర్ విజ్ఞప్తి చేశారు. ఎనిమిదేళ్లలోనే దేశ పారిశ్రామిక రంగంలో తెలంగాణ కీలకంగా మారిందని.. రాష్ట్రం అభివృద్ధి చేస్తున్న అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక మౌలిక వసతులకు జాతీయ ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. తెలంగాణ వంటి రాష్ట్రాలకు సహకరించడమంటే దేశానికి సహకరించినట్లే అవుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామిక రంగంలో చేపట్టిన కార్యక్రమాలకు రానున్న కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. ఈమేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు శనివారం ఆయన లేఖ రాశారు. తెలంగాణకు నరేంద్రమోడీ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకునే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల తన నిబద్ధత చాటుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి రాబోయే బడ్జెట్ ఉత్తమ సందర్భమని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులు, ప్రాజెక్టులను బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి వినూత్న పారిశ్రామిక విధానాలతో తెలంగాణ అద్భుత పారిశ్రామిక ప్రగతి సాధిస్తోందన్నారు. భారీ పెట్టుబడులకు అనుగుణంగా పెద్ద ఎత్తున మౌలిక వసతుల కల్పన చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్ ఫార్మాసిటీ లాంటి భారీ పారిశ్రామిక పార్కులు జాతీయ ప్రాధాన్యత కలిగి దేశ పారిశ్రామిక అభివృద్ధికి సైతం ఇతోధికంగా ఉపయోగపడతాయన్నారు. మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్ వంటి నినాదాలు, విధానాలను కేంద్ర ప్రభుత్వం బలంగా నమ్మితే, వాటిని నిజం చేయగలిగే శక్తి కలిగిన తెలంగాణ లాంటి రాష్ట్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ లాంటి ప్రొగ్రెసివ్ రాష్ట్రాలు బలంగా మారినప్పుడే దేశ ప్రగతి మరింత వేగంగా ముందుకు పోతుందని పేర్కొన్నారు. దేశ పారిశ్రామిక రంగంలో స్వల్పకాలిక ప్రస్థానంతోనే అత్యంత కీలకంగా మారిన తెలంగాణ రాష్ట్రానికి రానున్న కేంద్ర బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించాలని మంత్రి కెటిఆర్ విజ్ఞప్తి చేశారు. గత ఎనిమిదేళ్లుగా ప్రతి బడ్జెట్ సందర్భంగా ప్రోత్సాహకంగా దక్కాల్సిన నిధులపై అనేక సందర్భాల్లో విజ్ఞప్తులు చేసినప్పటికీ.. కేంద్రం నుంచి చెప్పుకోదగ్గ ఆర్థిక సాయం అందలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తన చివరి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందున తెలంగాణ ప్రయోజనాలు, అభివృద్ధికి దోహదపడే పలు అంశాలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. జహీరాబాద్ నిమ్జ్‌లో మౌలిక సదుపాయాల కోసం నిధులు ఇవ్వాలని కోరిన కెటిఆర్.. రూ.9,500 కోట్ల ప్రాజెక్టు వ్యయంలో కనీసం రూ.500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్ - విజయవాడ పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి ఆర్థిక సాయం అందించాలి. జడ్చర్ల పారిశ్రామిక పార్కులో ఉమ్మడి వ్యర్థాల శుద్ధి ప్లాంటును ఏర్పాటు చేయాలని, గ్యాస్ కేటాయింపులను వెంటనే ప్రకటించాలని కోరారు. బ్రౌన్‌ఫీల్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ల మంజూరు, అప్‌గ్రేడేషన్ చేపట్టాలన్న మంత్రి.. ఆదిలాబాద్ సీసీఐని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో నేషనల్ డిజైన్ సెంటర్ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్ ఫార్మా సిటీకి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌లో హైదరాబాద్‌ను చేర్చాలని కోరారు. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని.. బడ్జెట్‌లో కనీసం రూ.300 కోట్లు ప్రకటించాలని కోరారు. టెక్స్‌టైల్ పార్క్, వీవింగ్ పార్క్, అపెరల్ పార్క్‌లతో కూడిన మెగా పవర్‌లూమ్ క్లస్టర్‌ను సిరిసిల్లకు మంజూరు చేయాలని.. పవర్ లూమ్‌ల అప్‌గ్రేడేషన్ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బ్లాక్ లెవల్ హ్యాండ్లూమ్ క్లస్టర్లు మంజూరు చేయాలని , ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని మంత్రి కెటిఆర్ కేంద్రాన్ని కోరారు.

మారిషస్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

- హాజరుకానున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మారిషస్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు రాష్ట్ర మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ హాజరుకానున్నట్టు మారిషస్ తెలుగు మహాసభ సంఘం, తెలుగు కల్చరల్ ట్రస్ట్, తెలుగు స్పీకింగ్ యూనియన్ ప్రతినిధులు తెలిపారు. మారిషస్ తెలుగు మహాసభ ఏర్పడి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా రూపొందించిన లోగోను శనివారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా ప్రతినిధులు మాట్లాడుతూ మారిషస్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనాలంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను ఆహ్వానించినట్టు తెలిపారు. అక్కడ స్థిరపడిన తెలంగాణ ప్రజల కోసం సాంస్కృతిక, పర్యాటక, విద్యా అవకాశాలపై పరస్పర సహకారం అందించాలని కోరారు. వారి విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ ప్రతినిధి విశ్వకర్మ, బాలరాజ్ పెంటయ్య, ధరంరాజ్ నారాయణస్వామి, గురయ్య, రాజేంద్ర అప్పాలస్వామి, తెలుగు విద్యాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హైద్రాబాద్ నుంచి విజయవాడకు 1.24లక్షల వాహనాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి పండుగ సందర్భంగా గత రెండు రోజుల్లో హైదరాబాద్ నుంచి విజయవాడకు 1.24లక్షల వాహనాలు వెళ్లినట్లు రాచకొండ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. జనవరి 12న 56,500వాహనాలు వెళ్లగా.. 13న 67,500 కార్లు వెళ్లినట్లు వివరించారు. పంతంగి టోల్ గేట్ మీదుగా వెళ్లిన వాహనాల వివరాలను ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. పండుగల కోసం వెళ్తున్న వారిలో 90శాతం మంది వ్యక్తిగత వాహనాల ద్వారానే వెళ్లినట్లు తెలిపారు. రెండు రోజుల్లో మొత్తం 98వేలకు పైగా కార్లు హైదరాబాద్ నుంచి పంతంగి టోల్ గేట్ మీదుగా విజయవాడ వెళ్లినట్లు పోలీసుల లెక్కల్లో తేలింది. హైదరాబాద్ నుంచి వరంగల్‌కు బీబీనగర్ టోల్ గేట్ మీదుగా నిన్న 26వేల వాహనాలు వెళ్లాయని.. అందులో 18వేల కార్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వరంగల్ నుంచి హైదరాబాద్‌కు 13వేలకు పైగా వాహనాలు వచ్చినట్లు స్పష్టం చేశారు.

'మాంజా' అమ్మకాలు

- ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రమాకరమైన చైనా మాంజాలను అమ్ముతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల ఐదుగురిని శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30 వేల మాంజాలను స్వాధీనం చేసుకున్నారు. వనస్థలిపురం సీఐ కె.సత్యనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం.. నాగోల్ జైపూర్ కాలనీకి చెందిన కబీర్ రాజ్, విజయపురి కాలనీకి చెందిన దినేష్, మారుతినగర్‌కు చెందిన రజిని, బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన అఫ్రీజ్, వనస్థలిపురం కాంప్లెక్స్‌కు చెందిన మౌనిద్దీన్ చైనా మాంజాలను అమ్ముతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని మాంజాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు. శుక్రవారం హైదరాబాద్ నాగోల్‌లో బైక్‌పై వెళ్తున్న చిన్నారికి మాంజా తగిలి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అలాగే, సంగారెడ్డి జిల్లా జోగుపేటలో బైక్‌పై వెళుతున్న యువకుడికి చైనామంజా తగిలి గాయపడ్డారు.